స్థాపితము 1926 రిజిస్టర్ నెం. ఎ. 92

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమ రెడ్డి ఎమ్. ఏ.

సంపుటి: 14 సంచిక: 203 :: హైదరాబాద్, శుక్రవారము 4 - 8 - 1961 :: 4 పేజీలు 7 నయాపైసలు

మూడో ప్రణాళిక తుది నివేదికపై ప్రధాని సంతకం

న్యూఢిల్లీ, ఆగస్టు 3. 764 పేజీల డాక్యుమెంటుగా తుది స్వరూపం దాల్చిన తృతీయ ప్రణాళికా నివేదికపై యీ సాయంత్రం యోజన భవన్‌లో ప్రధాని (శ్రీ నెహ్రూ) ప్లానింగ్ కమిషన్ అధ్యక్షుడుగా సంతకం పెట్టారు. తరువాత కమిషన్ సభ్యులు 8 మంది కూడా సంతకాలుంచారు. సోమవారంనాడు యీ డాక్యుమెంటు లోకసభలో ప్రవేశపెట్ట బడుతుంది. ఈ ప్రణాళికను ప్రధాని నెహ్రూ "ఎదుర్కొడానికి సిద్ధపడుతున్న ఛాలెంజి" అని వ్యాఖ్యానించారు.

లలిత కళా సమితి సహాయార్థం

శ్రీ ఘంటసాల వెంకటేశ్వర్‌రావు అండ్ పార్టి వారిచే

గానకచేరి

(ప్రఖ్యాత తెలుగు సినిమా సంగీత దర్శకులు)
సరోజినీనాయుడు హాల్ రాంకోట్ సుల్తాన్ బజార్‌నందు
6-8-61 ఆదివారం సాయంత్రం 6-30 గం. జరుపబడును.
టికెట్లు అన్ని తాజ్‌మహల్ హోటళ్ళు, బృందావన్ మరియు కబళవాయి సత్యనారాయణ దుకాణములలో లభించును.

10148L

జాతీయసాంస్కృతిక శీలంలేని విద్యపట్ల డా. రాధాకృష్ణవిమర్శ

శాసనసభ ప్రశ్నోత్తరాలు:

హైకోర్టులో తెలుగుఉపయోగం:కళాశాలల్లో బోధనాభాష: 14 నెలల్లో 179 దారిదోపిడీలు

హైదరాబాద్, ఆగస్టు 3

హైకోర్టులో తెలుగు ఉపయోగార్థం అధికార మివ్వాల్సిందిగా గవర్నర్‌ను కోరుతలంపు ప్రభుత్వానికిలేదని నేడు శాసనసభ ప్రశ్నోత్తర సమయంలో ముఖ్యమంత్రి (శ్రీ) డి. సంజీవయ్య (శ్రీ) కాళీరెడ్డికి తెలియజేశారు.

రాష్ట్రమునందలి కొన్ని తాలూకా గ్రామస్థాయి కార్యాలయాల్లో తెలుగు అధికారభాషగా ప్రవేశపెట్ట బడిందని, క్రమంగా యితర కార్యాలయాలకు విస్తరించబడుతుందని ఆయన చెప్పారు.

నేరనిరోధకశాఖ మాజీ పి.డబ్ల్యుడి. డిప్యూటి సెక్రెటరీ (శ్రీ) రామప్పకు వ్యతిరేకంగా చేపట్టిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించు కోలేదని (శ్రీ) చొక్కారావుకు ముఖ్యమంత్రి సమాధాన మిచ్చారు.

1960లో 179 దారిదోపిడీలు

1960 జనవరినుండి 1961 ఫిబ్రవరి 20 వరకు రాష్ట్రంలో 179 దారిదోపిడీకేసులు నమోదయ్యాయని మరోప్రశ్నకు ఆయనజవాబిచ్చారు.

దుకాణాలలో ధరలసూచీలను ప్రదర్శించాలనితెలుపుతూ ప్రధానితన కెట్టిలేఖయూ వ్రాయలేదని కూడ ఆయన చెప్పారు.

భద్రాచలం డివిజన్‌లో కొండ తెగలవారు 22,592 ఎకరాలు, యితరులు 69,604 ఎకరాల భూమిని కలిగియున్నారని ఉప ముఖ్యమంత్రి (శ్రీ) కె. వి. రంగారెడ్డి (శ్రీ) మతి వాడి రమణారావుకు తెలిపారు. కొండ తెగలవారికి పట్టాలిచ్చు విషయమై ప్రశ్నించగాభద్రాచలభూములు సర్వే చేయబడలేదని, సర్వేమరియు సెటిల్‌మెంటు పనులు పూర్తిఅగువరకు కేటాయింపు ఆపబడిందని. యీ సంవత్సరం సర్వేచేపట్ట బడుతుతుందని, నాగార్జాలూకా ప్రాంతభూములు సర్వే చేయబడినందున ప్రత్యేక నిబంధనల ప్రకారం కేటాయించుట జరిగిందని తవాబిచ్చారు.

వంశధారపై అనకట్ట

(శ్రీ) కాకుళం జిల్లా పాతపట్నం తాలూకాలోని కడంద గ్రామ వంశధార నదిపై వరదనిరోధానికై అనకట్ట కట్టే విషయమై ప్రభుత్వం పరిశీలనలు జరిపిందని ఒక సభ్యునికి ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకై రూ. 40 వేలు ఖర్చుకాగలవని అంచనావేయబడింది. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్- ఒరిస్సా ప్రభుత్వాలు సెరిసమానముగా భరిస్తాయి. ఒరిస్సా ప్రభుత్వం తమవాటా మొత్తాన్ని మంజూరు చేసినవెంటనే పనిచేపట్టబడి పూర్తి చేయబడుతుంది. ముఖ్యమంత్రి మరోప్రశ్నకు సమాధానమిస్తూ పాతపట్నం తాలూకాజాతిల్లిదక్కర యెర్రగడ్డ రిజర్వాయర్ పథకం కూడ పరిశీలించబడిందని, అందుకై 3.91 లక్షలు ఖర్చు కాగలదని అంచనా వేయబడిందని, త్వరలోనే పనిచేపట్టబడుతుందని చెప్పారు.

కళాశాలల్లో బోధనా భాష

కళాశాలల్లో ఇంగ్లీషుకు బదులుగా ప్రాంతీయ భాషను బోధనా భాషగా ప్రవేశపెట్టు వుద్దేశం ప్రభుత్వానికి లేదని (శ్రీ) కాళీరెడ్డికి ప్రణాళిక, సమాచార మంత్రి తెలియజేశారు. నెల్లూరులో మహిళాకళాశాల ప్రయివేటుగా ప్రారంభించిన ప్రభుత్వం సహాయపడుతుందని ఆయన చెప్పారు. వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో రాత్రి తరగతు లారంభించు ప్రతిపాదన లేదని, అయితే కొన్ని అనుబంధ కళాశాలలలో తరగతు లారంభించుటకు 1960-61 నుండి అనుమతి యివ్వబడిందని, రాత్రి తరగతుల శిక్షణాకాలం కళాశాల శిక్షణాకాలం కన్నా హెచ్చుగా యుండాలని సిండికేట్ అభిప్రాయపడిందని, అంటే పి.యు.సి రెండు సంవత్సరాల కోర్సుగను, డిగ్రీ వాల్గు సంవత్సరాల కోర్సుగను యుండాలని, యిట్టితరగతులు ఒక్క నెల్లూరులో మాత్రమే ప్రారంభింపబడినాయని కూడ మంత్రి తెలిపారు.

పూనాలోగాని, బిలాస్‌పూర్‌లోగాని కేంద్ర వృత్తి పనివారల శిక్షణా సంస్థలలో శిక్షణ పొందేందుకై అభ్యర్థుల సంపుట రెండు ప్రత్యేక పథకాల క్రింద జరుగుచున్నదని, ఒకటి ఉద్యోగంలో నున్నవారికి రెండవది నూతన అభ్యర్థులకని, ఉద్యోగంలో నున్నవారిని సీనియారిటీ, యితర అర్హతలనుబట్టి ఎన్నుకుంటారని, నూతన అభ్యర్థులను ప్రతిపర్యాయం ఒక ప్రకటనచేసి అభ్యర్థన పత్రాలను అంపుకున్నవారిలో నుండి ఎంపిక చేస్తారని, ఎన్నుకోబడినవారు 6 మాసాల శిక్షణకై అంపబడతారని, శిక్షణానంతరం పారిశ్రామిక శిక్షణాసంస్థలలో వృత్తి పనుల బోధకులుగా వారిని నియమిస్తారని (శ్రీ) వేమయ్య ప్రశ్నకు మంత్రి సమాధాన మిచ్చారు.

పంచాయత్ సమితుల కార్యాలయ నిర్వాహకుల ప్రిమోషన్ లకయి కొన్నిస్థానాలు కేటాయించుట సాధ్యం కాదని మంత్రి మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు.

త్రిపురాంతక దేవస్థానం పునరుద్ధరణ

కర్నూలుజిల్లా త్రిపురాంతక దేవస్థానము పునరుద్ధరణ సంఘాన్ని హిందూమత, ధర్మాదాయ శాఖ నియమించిందని సహకార, ధర్మాదాయ మంత్రి ఒక సభ్యునికి ప్రత్యుత్తరమిచ్చారు. మహానందేశ్వరంలోని రెండు దేవాలయాలలో క్రిమంగా పూజలు జరుగుచున్న వని కూడ ఆయన సెలవిచ్చారు. ధర్మాదాయ శాఖోద్యోగులందరూ ప్రభుత్వోద్యోగులని, మినిస్టీరియల్ నిబ్బంది మినిస్టీరియల్ సర్వీస్ నిబంధనలు, గజిటెడు నిబ్బంది హిందూమత ధర్మాదాయ సర్వీస్ నిబంధనలు వర్తిస్తాయని, మరోప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

రాష్ట్రంలో 192 సహకార విక్రయ సంఘాలు

ఆంధ్రలో 133, తెలంగాణలో 59 సహకార విక్రయ సంఘాలున్నాయని మంత్రి వేరొకప్రశ్నకు జవాబిచ్చారు.

1960 మార్చినుండి డిసెంబర్ 28 వరకు మూసీ ప్రాజెక్టు నిర్మాణ సందర్భమున కార్మికుల నష్టపరిహారచట్టం క్రింద 13 గురికి పరిహారం చెల్లించబడిందని, కార్మికమంత్రి చెప్పారు.

కేంద్రం నియమించిన పంచదార వేతననిర్ణాయక సంఘ సలహాలపై కేంద్రప్రభుత్వఅభిప్రాయాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయబడినాయని విషయం పరిశీలనలో యుందని (శ్రీ) రామచంద్రారెడ్డి ఒకసభ్యునకు సమాధానమిచ్చారు.

5 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

నేడు రాష్ట్ర శాసనసభలో 5 బిల్లులు ఆమోదింపబడ్డాయి. అలవాటు నేరస్తులకు శిక్షణ పూర్వకమయిన చికిత్సను దృష్టించిన బిల్లు మొదటిపరిశీలన నేడు ముగిసింది. రేపు చర్చ జరుగుతుంది.

కలెక్టర్ల అధికారాలను జాయింట్ కలెక్టర్లకు లేదా డిప్యూటీ కలెక్టర్ల హోదాకుతగ్గని యితర రెవెన్యూ అధికారులకు అప్పగించడానికి వీలుగా కలెక్టర్ల అధికారాల బిల్లును శాసనసభ ఆమోదించింది. దీనిని సెలక్టు కమిటీకి నివేదించాలన్న (శ్రీ) వావిలాల గోపాలకృష్ణయ్య కోరిక తోసివేయబడింది. విమానాశ్రయాల ఆవరణల్లో తిరిగే పశువులను పట్టుకొని బందెల దొడ్డిలో పెట్టే అధికార మిస్తూ ఒక బిల్లు ఆమోదింపబడింది. ఆంధ్రప్రాంతంలోగల వడ్డీ వ్యాపారపు చట్టాల బిల్లును తెలంగాణాకు విస్తరించే బిల్లు కూడా ఆంగీకరింప బడింది. దీని ద్వారా వడ్డీవ్యాపారాల కేసులపట్ల కోర్టులకు విశేషాధికారాలివ్వబడ్డాయి ఋణాలుయిచ్చేవారి రిజిస్ట్రేషన్ లైసెన్సుల బిల్లును కూడా అసెంబ్లీ ఆమోదించింది.

ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలలో రెండుతీరులుగా ఉన్న చట్టాల్ని కేంద్రం పంపిన నమూనా బిల్లు ప్రకారం క్రోడీకరిస్తూ అలవాటు నేరస్తుల శిక్షణబిల్లు ప్రథమ పరిశీలనను అసెంబ్లీ పూర్తిచేసింది. దీన్ని సెలక్టు కమిటీకి నివేదించాలన్న (శ్రీ) వావిలాల గోపాలకృష్ణయ్య ప్రతిపాదన వీగిపోయింది. రేపు ఉదయం వరకు సవరణలకు గడువునిస్తూ సభాపతిగా వ్యవహరించిన (శ్రీ) పి. వి. నరసింహారావు బిల్లు పరిశీలనను రేపటికి నిర్ణయించారు.

తెలంగాణా అన్నిగ్రామాల్లో గీత పారిశ్రామిక సహకార సంఘాలు

స్థాపించాలని భోనగిరి గీత పారిశ్రామికుల అభ్యర్థన

భోనగిరి, ఆగస్టు 3

"గతమూడు సంవత్సరముల నుండి తెలంగాణాలో పనిచేయుచున్న సమష్టి గీత పారిశ్రామిక సహకార సంఘాలు పారిశ్రామికులకు యేమాత్రం లాభదాయకంగా లేవు. సహకార సంఘాల్లోని కొందరు ప్రముఖులు లాభాలను గడించారు. సంఘాలకు కాంట్రాక్టు డబ్బు తగ్గించి యిచ్చుటవల్ల ప్రభుత్వానికికూడ నష్టంగానేయుంది. సహకార సంఘాలను రద్దుపరచిన దాదాపు 4 లక్షల రూపాయలు ప్రభుత్వానికి లాభముంటుంది. ఉదాహరణకు దేవరకొండ సమష్టి సహకార సంఘాలకు యింతకుముందు 4 వేల సెలసరి కాంట్రాక్టు యివ్వబడింది. ఇపుడుఅదే 9 వేల కివ్వబడుచున్నది. కనుక సమష్టి సహకార సంఘాలు లాభదాయకమైనవి కావు" అనిభోనగిరి గీత పారిశ్రామికులు అభిప్రాయ పడ్డారు.

సమష్టి సహకార సంఘాలను రద్దుపరచి వాటిస్థానే చిన్నసంఘాలను స్థాపించుటకు ప్రభుత్వం చేసిన నిర్ణయంపట్లవారు తమహర్షం వెలిబుచ్చుతూ తెలంగాణాలోని మిగతా 20వేల గ్రామాల్లో కూడ గీత పారిశ్రామిక సంఘాలను స్థాపించాలని కోరారు.

సెప్టెంబర్‌నుండి రైస్ మిల్లుల మూసివేత

తమకిష్టంలేకన్నా తప్పనిసరి అయిందని శ్రీ రోశయ్య ప్రకటన

హైదరాబాద్, ఆగస్టు 3

సెప్టెంబర్ 1వ తేదీ నుండి రాష్ట్రమంతటా రైస్ మిల్లులను మూయుట తప్పనిసరియేనని ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్సు సంఘ సంయుక్త కార్యదర్శి (శ్రీ) కే. రోశయ్య ఇచట తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ సంఘములో 1200 మిల్లులు సభ్యత్వం కలిగియున్నవని, యివన్నీ పశ్చిమ, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోనున్నవని ఆయన చెప్పారు. సంఘములో సభ్యత్వములేనట్టి తెలంగాణా మిల్లులుకూడ ఉద్యమంలో పాల్గొంటాయని (శ్రీ) రోశయ్య ఆశాభావం ప్రకటించారు.

మిల్లుల మూసివేయుటకుగల కారణాలను వివరిస్తూ ప్రభుత్వ నిర్ణయాలకు నిరసనగా యీ చర్య తీసుకోబడుచున్నదని, మస్టర్ రోల్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంచేసిన నిర్ణయాలను అమలు పరచగూడదని ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రివద్దకు రాయబారాలు నడిపినా యింతవరకెట్టి సమాధానం రాలేదని, 1958లో ప్రభుత్వంతో వివాదమేర్పడిందని, మిల్లులను మూసివేయుట తమ అభిమతం కాకున్నా అలాచేయుట తప్పనిసరిఅయిందని (శ్రీ) రోశయ్యచెప్పారు.

మధ్యప్రదేశ్‌లో అల్యూమినం ప్లాంట్

భోపాల్, ఆగస్టు 3

మధ్యప్రదేశ్‌లోని అమర్‌కాంతక్ ప్రాంతంలో అల్యూమినియం ప్లాంట్‌ను పబ్లిక్ రంగంలో నెలకొల్పుటకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదని రాష్ట్ర పరిశ్రమల మంత్రి (శ్రీ) బి. ఏ. మండ్లాయ్ ఇక్కడ విలేఖరులకు తెలియ చేశారు.

ప్రైవేటు రంగంలో ఈ తరగతికి చెందిన ప్లాంట్లను నెలకొల్పుటకు పారిశ్రామిక వేత్తలవద్ద నుంచిదరఖాస్తులు వచ్చాయని అవి ప్రభుత్వ పరిశీలనలో వున్నాయని ఆయన చెప్పారు.

పబ్లిక్ రంగంలో నెలకొల్పదలచిన ఈ ప్లాంట్ విషయంలో పరిస్థితులను అవగాహన చేసుకొనుటకు హంగేరికి చెందిన నిపుణులు అమర్‌కాంతక్ ప్రాంతానికి త్వరలో రానున్నారని రాష్ట్ర పరిశ్రమల మంత్రి వివరించారు.

ఆంధ్ర జాతీయ కళాశాల స్వర్ణోత్సవాలు

బందరురేవు అభివృద్ధి కృషికై పౌర సన్మాన సభలో వాగ్దానం

మచిలీపట్నం, ఆగస్టు 3

జాతీయతను, ప్రాచీన సంస్కృతిని క్రోడీకరిస్తూ నూతనముగా ఒక విద్యావిధానాన్ని దేశానికి రూపొందించాలనీ అప్పుడు ప్రాంతీయ భాషా, భౌగోళిక పరిమితులను దాటి అది జాతీయ విద్యాపద్ధతిగ తయారుకాగలదనీ, జాతీయ సాంస్కృతిక శీలం యీనాటి విద్యకు లేనందున విద్యా సంపలనుండి జీవితములో అడుగుపెట్టే మన విద్యార్థులు, పైనపటారం లోనలోటారము"గా మిగిలిపోతున్నారనీ తాత్కాలిక రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణ నేడు పేర్కొన్నారు.

ఆంధ్ర జాతీయ కళాశాల స్వర్ణోత్సవాల ప్రథమదిన సమావేశానికి యీ సాయంత్రం డా॥ రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. తమ మనోభావాల్ని త్యాగంచేసి నిజమయిన జాతీయ కళాశాలను స్థాపించిన జాతీయ విద్యావేత్తలగు ఆంధ్ర ప్రముఖుల కాయన జోహార్లర్పించారు.

1951లో భారత జాతీయ పతాకాన్ని తయారుచేసిన (శ్రీ) పి. వెంకయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడముతో స్వర్ణోత్సవాలు ఉదయం ప్రారంభ మయినాయి. డా॥ పట్టాభి సీతారామయ్య పేరిట కట్టిన సెంచరల్ సైన్సెస్ విభాగాన్ని ఆంధ్ర యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ డా॥ ఎ. ఎల్. నారాయణ తెరిచారు. కాలేజి విద్యార్థుల ప్రదర్శనానికి శాసనమండలి ఉపాధ్యక్షుడు (శ్రీ) జి. ఎస్. రాజు ప్రారంభోత్సవం జరిపారు.

మున్సిపాల్టీ పౌరసన్మానం

బందరు మున్సిపాల్టీ యీవేళ డా॥ రాధాకృష్ణకు సన్మానంజరిపింది. సన్మానపత్రంలో అభ్యర్థించబడిన అంశాన్ని పేర్కొని డా॥ రాధాకృష్ణ ప్రాచీనమైన బందరురేవు అభివృద్ధికి వీలున్నంత కృషి చేస్తానని వాగ్దానం చేశారు. ప్రముఖవిద్యావేత్త మద్రాసు యూనివర్శిటీ మాజీవైస్ ఛాన్సలర్ అగు కీ. శే. రఘుపతి వెంకటరత్నం నాయుడు చిత్రపటాన్ని కూడా ఆయన మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ డా॥ రాధాకృష్ణ మనసంప్రదాయ మంతా క్లుప్తంగా చెప్పాలంటే "తత్త్వమసి" అన్న సూక్తిలోనే ఉందన్నారు. డా॥ రాధాకృష్ణకుపూర్ణకుంభంతో స్వాగత మివ్వబడింది.

తాత్కాలిక రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ నేటిఉదయం 8-15 నిముషాలకు గన్నవరం విమానాశ్రయంలోదిగి బందరు జాతీయకళాశాల స్వర్ణోత్సవాలు ప్రారంభించుటకు వెంటనే మోటారులో మచిలీపట్టణం చేరారు.

మద్రాసు స్పీకర్ మృతి

మద్రాసు, ఆగస్టు 3

మద్రాసు శాసనసభ స్పీకర్ డాక్టర్ యు. కృష్ణారావు గత రాత్రి మరణించారు. వీరివయస్సు 61సంవత్సరాలు.

ఆంధ్రఅసెంబ్లీలో ప్రస్తావన

మద్రాసు శాసనసభాధ్యక్షులు (శ్రీ) యు. కృష్ణారావు మరణ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభాధ్యక్షులు (శ్రీ) కాళేశ్వరరావు శాసనసభలో ప్రస్తావించి ఆయనొక మహావ్యక్తిఅని అభివర్ణించారు.

స్వతంత్ర సభ్యుడు (శ్రీ) వావిలాల గోపాలకృష్ణయ్య కృష్ణారావుమరణమునకు సంతాప తీర్మానము చేయాలని కోరగా సభాసభ్యులు కాని వారి మృతిపట్ల సంతాప తీర్మానం చేయాల్సిన అవసరములేదని (శ్రీ) కాళేశ్వరరావు తెలిపారు.

పంచదారసరఫరాపై గల నిర్బంధాలు

సవరింపబడగలవని కేంద్ర ఆహార మంత్రి ప్రకటన

బొంబాయి, ఆగస్టు 3

పంచదార పంపకంపైగల ప్రస్తుతం గల నిర్బంధాలు దాదాపు అన్నీతొలగింప బడగలవని అందువల్ల ఈ సరుకు దేశంలోని అన్ని ప్రాంతాలకు సులభంగా రవాణాఅయి మునుముందు పంచదార ధర తగ్గగలదని కేంద్ర ఆహారమంత్రి ఎస్. కె. పాటిల్ తెలిపారు.

చిత్తూరునుండి లోకసభకు శ్రీఅయ్యంగార్ అభ్యర్థిత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 3

లోకసభకు చిత్తూర్ ఉపఎన్నికల స్థానం నుండి పోటీ చేయడానికి లోకసభ స్పీకర్ (శ్రీ) ఎం. అనంతశయనమయ్యంగార్ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి దరఖాస్తు పంపారు. స్థానిక డి. సి. సి. వారు యీ దరఖాస్తును బలపరిచారు.

సంప్రదాయం ప్రకారం స్పీకర్ పోటీచేస్తున్న స్థానంలో మరో పార్టీ పోటీకూడా తనఅభ్యర్థిని నిలుపదని తెలుస్తున్నది.

...—

జైలుపై తిరుగుబాటు దారుల దాడి

బర్మాలోని ఉత్తరపాన్ రాష్ట్రములో

రంగూన్, ఆగస్టు 3

ఉత్తరపాన్ రాష్ట్రములోని నిన్విజైలుపై పాన్ తిరుగుబాటుదారులు దాడిచేయగా ఒక పోలీసు చనిపోయాడు. మరో తొమ్మిదిమంది పోలీసుల జాడ కాన్పించడములేదు. బర్మా సైనికులు జరిపిన కాల్పులవల్ల ఇద్దరు పాన్ తిరుగుబాటుదారులు చనిపోయారు. మరో ఇద్దరు పట్టుబడినారు.

బెల్‌గ్రేడ్‌కునేపాల్ రాజు ప్రయాణం

తటస్థ రాజ్యాల శిఖరాగ్ర సమావేశం నిమిత్తం ఆగస్టు 28 న

ఖాట్మాండు, ఆగస్టు 3

బెల్‌గ్రేడ్‌లో సెప్టెంబరు నుండి జరిగే తటస్థరాజ్యాల శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు నేపాల్ రాజు మహేంద్ర 28 వతేదీన బయలుదేరుతారు. ఆరోజు మహేంద్ర దంపతులు ఢిల్లీలోనిరాష్ట్రపతి భవన్‌లో భారత ప్రభుత్వ అతిథులుగా ఉండి మరునాడు బెల్‌గ్రేడ్‌కు ప్రయాణమౌతారు.

నేపాల్ ప్రతినిధివర్గ నాయకుడుగా రాజు మహేంద్ర రాజకీయ అంతర్జాతీయ సమావేశానికి హాజరు కావడం ఇదేప్రథమం.

బెల్‌గ్రేడ్‌నుండి తిరిగివచ్చి మహేంద్రదంపతులు మూడువారాలు వైవాహ్యటనకు వెళ్తారు.

ఆంధ్ర ప్రజాపార్టీ

హైదరాబాద్, ఆగస్టు 3

వచ్చే ఎన్నికలలో ఆంధ్రప్రజాపార్టీ రాష్ట్ర శాసనసభకు 150 స్థానాలకు, లోకసభకు 22 స్థానాలకు తన అభ్యర్థుల నిలబెట్టుతుంది.

ఆంధ్ర ప్రదేశ్ యాదవ సంఘ ప్రథమ కార్య వర్గ సమావేశం

హైద్రాబాదు, ఆగస్టు 3

ఆంధ్ర ప్రదేశ్ యాదవ సంఘ ప్రథమకార్యవర్గసమావేశము కర్నూలు టౌన్ హాలులో, సంఘ అధ్యక్షులు (శ్రీ) పోలం వీరయ్య అధ్యక్షతన 6వ తేదీ, ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుంది.

హుస్సేన్‌సాగర్ చెర్వునీరు

హైద్రాబాద్, ఆగస్టు 3

హుస్సేన్‌సాగర్ చెర్వు దాదాపు పూర్తిగా నిండింది. ఇంకా వర్షాలు పడితే అలుగుమీదుగా నీరు ప్రవహించే అవకాశం ఉంది. కాబట్టి అలుగు కాలువవొడ్డున నివసిస్తున్న ప్రజలు యీ విషయాన్ని గమనించి జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేయబడింది.

సిద్దిపేటలోఉర్దూ 9 వ తరగతి

సిద్దిపేట, ఆగస్టు 3

గతమాసం 31 న సిద్దిపేట ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి (తెలుగు)కి విద్యాశాఖ డైరెక్టర్ (శ్రీ) ఎన్ రాంలాల్ ప్రారంభోత్సవము జరిపారు. (శ్రీ) పి. వి. రాజేశ్వరరావు ప్రారంభోత్సవమునకధ్యక్షత వహించారు. ప్రధానోపాధ్యాయులు (శ్రీ) వెంకటేశ్వరరావు నివేదికను చదివారు. విద్యా సంఘాధ్యక్షులు (శ్రీ) పి. మల్లేశం స్వాగతం చెప్పారు.

సిద్దిపేట బాలికోన్నత పాఠశాలలో 8 వతరగతి (ఉర్దూ) ప్రారంభించాల్సిన అవసరాన్ని (శ్రీ) అన్వర్ అదీబ్ డైరెక్టర్‌కు వివరించారు. సిద్దిపేటలో ప్రాథమికశిక్షణ పాఠశాలను యేర్పాటుచేయ ప్రయత్నం చేస్తానని డైరెక్టర్ ఆవిషయమై కలిసిన రాయబార వర్గానికి తెలిపారు. బాలికల పాఠశాల భవనము నిర్మించబడుచున్న స్థలాన్ని, కళాశాల భవనాన్ని (శ్రీ) రాంలాల్ పరిశీలించారు.

రిజర్వు స్థానాల అభ్యర్థులు

హైద్రాబాద్, ఆగస్టు 3

రిజర్వు స్థానాలనుండి ఎన్నికల్లో పోటీ చేయడానికి దరఖాస్తులు పెట్టిన వారు తాము షెడ్యూల్డు కులాలు, ట్రయిబులలో సభ్యులని నిర్ధారిస్తూ తాసిల్దారునుండి ఆగస్టు 31 లోగా సర్టిఫికేటును జతపరచాలని పి. పి. సి. నేడొక ప్రకటనలో తెలిపింది.

కాంగో లో భాగంగా కటాంగా స్వాధీనం

నూతన ప్రధాని అదౌలా ప్రకటన: షాంబే అరెస్టుకు కూడా నిశ్చయం

లియోపాల్డువిల్, ఆగస్టు 3

కొద్ది దినాలలోనే కటాంగా ప్రత్యేకతను తొలగించి దాన్ని కాంగో అంతర్భాగం కావించడానికి తన ప్రభుత్వం తలపోసిందని నేడు కాంగో పార్లమెంటులో తొలిగా ప్రసంగిస్తూ నూతన కాంగో ప్రధాని, రక్షణమంత్రి అగు సిరిల్ అదౌలా ప్రకటించాడు

కాంగోనుండి కటాంగా వేరుపడి వ్యవహరించడంవల్ల చాలా హాని కలిగిందంటూ అదౌలా మోసేషాంబే వైఖరిని ఖండించాడు. దేశ వ్యవహారాలలోను, ఆర్థిక స్థోమతలోను గల ఆస్తిమిత్తత్వం తన ప్రభుత్వాన్ని ప్రధానముగా ఎదుర్కొగల సమస్య అన్నాడు.

కటాంగాలోని కొందరు నాయకులు కాంగో ప్రజలుగా ఉండదలుచుకోలేదని కాంగో అధ్యక్షుని కాంగో ప్రజాప్రతినిధులు మన్నించడం నేర్పడానికి షాంబేను అరెస్టు చేయడం అవసరమని అదౌలాఅన్నాడు. దేశానికంతా ఒకే ఐక్య సైన్యం ఉండాలని అదౌలా తెలిపాడు. దేశ ఋణ స్థితి నెలకు 600 మిలియన్ కాంగో ఫ్రాంకులచొప్పున పెరుగుతున్నదన్నాడు. కాంగో ఎగుమతుల పెంపుదలను, లోగుట్టు ఏమీలేని విదేశీ సహాయాన్ని అదౌలా ఆశించాడు. తగు కారణం లేకుండా నేరస్తులుగా భావింపబడి అరెస్టయిన రాజకీయ ఖైదీల నందరినీ విడుదల చేయగలనని అదౌలా ప్రకటించాడు.

సిరిల్ అదౌలా ఏర్పరచిన నూతన కాంగో ప్రభుత్వంలో మాజీలుముంబా ప్రభుత్వపు ఉపప్రధాని అంటోనీ గిజెంగా ఉపప్రధానిగానే నియమింపబడ్డాడు. కాని మరో యిద్దరు ఉపప్రధానులు కూడా గిజెంగాతో పాటు ఉన్నారు. వారు: ఇలియో ప్రభుత్వపు ఉపప్రధాని జీన్‌బొలికాంగో, ఉత్తర కటాంగా బలూబకత్ పార్టీ నాయకుడు జోసన్ సెండ్వేలు. విదేశాంగ మంత్రిగా జస్టిస్ బొంబాకో, సమాచార మంత్రిగా మాజీ ప్రధాని ఇలియో ఉన్నారు.

విజయవాడలో వరదకట్ట నిర్మాణం

త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం

హైద్రాబాద్, ఆగస్టు 3

కృష్ణలంకకు వరదశాశ్వతి లేకుండా విజయవాడలో వరదకట్ట నిర్మాణానికై ప్రభుత్వం ఆర్థిక, పి.డబ్ల్యు.డి. అధికారులతో సమాలోచించి త్వరలోనే నిర్ణయం గైకొంటుందని నేడు అసెంబ్లీలో స్థానిక సంస్థల మంత్రి (శ్రీ) మందుముల నరసింగరావు తెలిపారు.

(శ్రీ) వెల్లంకి విశ్వేశ్వరరావు (కమ్యూ) తెచ్చిన విరామ తీర్మానంపై మంత్రి యీ ప్రకటన చేశారు వరదనీటివల్ల కృష్ణలంకలోని గొట్టపు బావులు చెడిపోయి జులై 16 నుండి 21 వరకు విజయవాడలో నీటిసప్లయి సౌకర్యాలు దెబ్బతిన్నాయి.

విజయవాడలో వరదకట్ట నిర్మాణానికి 8 లక్షలు ఖర్చవుతుంది. దాని నిర్వహణకు 58 చేలు అవుతుంది విజయవాడ మున్సిపాల్టీ యీ వరదకట్ట నిర్మాణానికి పూనుకుంటే ప్రభుత్వం సగం ఖర్చును ఋణంగా ఇవ్వడానికి ఆలోచిస్తుందని మంత్రి చెప్పారు.

ముఖ్యమంత్రి (శ్రీ) సంజీవయ్య కూడా మాట్లాడుతూ యీవిషయమై జాప్యం ఉండదన్నారు.

పిమ్మట విరామ తీర్మానం త్రోసిపుచ్చబడింది.

అల్జీరియా ప్రభుత్వానికి పాక్ పరిగణన

ట్యునీషియాపట్ల సానుభూతి

కరాచి, ఆగస్టు 3

ఫర్హత్ అబ్బాస్ నాయకత్వాన గల అల్జీరియా ప్రభుత్వాన్ని నేడు పాకిస్తాన్ పరిగణించింది. ఇప్పుడు ఉభయ ప్రభుత్వాలమధ్య దౌత్య సంబంధాలేర్పాటు కాగలవు.

ట్యునీషియా అధ్యక్షుని ప్రత్యేక ప్రతినిధి నేడిక్కడికివచ్చి విదేశాంగ శాఖాధికారులను కలిసిన తర్వాత కొంతసేపటికి పైప్రకటన జరిగింది. ట్యునీషియా ప్రతినిధి రేపు రావల్పిండిపోయి ప్రెసిడెంట్ అయూబ్‌ఖాన్‌ను కలుస్తాడు.

విదేశాల సమస్యపై పాకిస్తాన్ ట్యునీషియా పట్ల సానుభూతి కలిగి ఉండని ట్యునీషియా సహాయానికి వెళ్ళదలిచే స్వచ్ఛంద సేవకుల్ని పాక్ ప్రభుత్వము నిరోధించబోదని పాక్ విదేశాంగ మంత్రి మంజూర్ ఖాదిర్ వ్రకటించాడు.

...—

రాష్ట్రపతికి దేశీ గడియారాల బహూకృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 3

హిందూస్థాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీలో తయారయిన రెండు గడియారాలను నేడు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ (శ్రీ) ఎం. కె. మతుల్లా రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్‌కు బహూకరించారు. బహూకరింప బడిన గడియారాన్ని స్వీకరిస్తూ డా॥ ప్రసాద్ ఫ్యాక్టరీకృషిని ప్రశంసించారు.

ఆగస్టు 6న కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ సమావేశం

హైద్రాబాదు, ఆగస్టు 3

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేచర్ కాంగ్రెసుపార్టీ సమావేశం ఆగస్టు 6వ సాయంత్రం 6 గంటలకు అసెంబ్లీ భవనమందలి కమిటీ రూంలో జరుగుతుంది.

శాసన సభా ఓటర్ల జాబితాలపునఃపరిశీలన

క్లెయిములు, అభ్యంతరాలు

హైద్రాబాదు, ఆగస్టు 3

హైద్రాబాదు నగరములోని యీ క్రింద పేర్కొన్న శాసన సభా నియోజక వర్గాల ఓటర్లజాబితాల ముసాయిదాలు 1961 జూలై 25 వ

సంస్కృత భాషాభివృద్ధికై ఆర్థిక సహాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 3

స్వచ్ఛంద సంస్కృత సంఘాలు, సంస్థలు, పాఠశాలలు మొదలైన వాటికి ఆర్థిక సహాయం అందజేసే పథకాన్ని 1961-9-62 వ సంవత్సరంలో కొనసాగించడానికి భారత ప్రభుత్వము నిశ్చయించింది.

సంస్కృత భాషా విస్తరణ, అభివృద్ధులకు సంబంధించిన నిర్దిష్టమైన ముఖ్య ప్రయోజనాలకొరకు సుప్రసిద్ధ సంస్కృత సంఘాలు, సంస్థలు, పాఠశాలలు పునరావృత్తంకానిగ్రాంట్ల కొరకై పంపుకొనే విజ్ఞప్తులను మాత్రమే ఈ పథకంక్రింద పరిశీలిస్తారు. అయితే, కొన్ని ప్రత్యేక సందర్భాలలో సంస్కృత గ్రంథాల కొనుగోలు కొరకూ, నిష్ణాతులైన విద్వాంసులు సంస్కృతంలో రచించిన ఉత్తమప్రమాణముగల వ్రాత ప్రతుల ప్రచురణ కొరకూ పంపే విజ్ఞప్తులను కూడా ప్రభుత్వం పరిశీలిస్తుంది. సంస్థల నిర్వహణకై ఎట్టి గ్రాంట్లుకాని ఇవ్వరు.

దరఖాస్తులు నిర్ణీత ఫారాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలద్వారా 1961 సెప్టెంబరు 30 వ తేదీలోగా భారత ప్రభుత్వానికి అందచేసుకోవాలి. దరఖాస్తుఫారాలు, నియమావళి, నిబంధనావళి కావలసిన వారు స్పెషల్ ఆఫీసర్ సంస్కృతం విద్యా మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ-కవ్రాసి తెప్పించుకొనవచ్చును.

ఫక్తూనిస్తాన్ ఉద్యమం

భారత ప్రజలు పార్టీలు అవగాహన చేసుకోవాలని విజ్ఞప్తి

హైదరాబాదు, ఆగస్టు 3

ఫక్తూనిస్తాన్ సాధనకై పఠాన్‌లు జరిపే పోరాటం ఎట్టిదో ఈ ఉద్యమ వాస్తవస్థితిగతులెట్టివో భారతదేశములోని రాజకీయపక్షాలు ప్రజలుగ్రహించాలని అఖిలభారత ఫక్తూన్‌జర్గాయె హింద్ అధ్యక్షులు మహ్మద్ అక్‌బర్ ఖాన్ కోరారు.

నిన్న ఇక్కడ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ శ్రీ ఖాన్ పాకిస్తాన్ నిర్మాణానికి ముస్లింలు ఎట్టి స్వయం నిర్ణయాధికారాన్ని వాంఛిస్తున్నారో మేమూ అదే స్వయం నిర్ణయహక్కును కోరుతున్నామన్నారు.

బాలుని హత్యచేసినందుకు మరణదండన

సికింద్రాబాద్, ఆగస్టు 3

1959 అక్టోబరులో ఏడు సంవత్సరాల బాలుని హత్యచేసిన నేరానికి దుర్గయ్య అను వాతనికి ప్రిన్సిపల్ సెషన్స్‌జడ్జి ఎస్. ఓబుల్ రెడ్డి మరణదండన విధించారు.

జనతా థియేటర్

మా యొక్క

నాటకములు

హైదరాబాద్ నగరములో అతిత్వరలో ప్రదర్శింపబడును.

తేదికై నిరీక్షించండి.

నేను అత్యంత అభిమానంతో సిఫారసు చేయుచున్నాను.

పోలీసు అసిస్టెంట్ కమిషనర్ (సి. ఎ. ఆర్.) పేట్లాబురుజ్, హెడ్ క్వార్టర్స్. హైద్రాబాద్. (శ్రీ బి.వి.డి. ప్రసాదరావు)

ఇంగ్లీషునుండి తర్జుమా.

ఇట్లు వ్రాయుచున్నారు. 1961 జూన్ 6 వ తేదీ డాక్టర్ లుఖ్మాన్ గారి (నేత్రపరీక్షా నిపుణులు)చే నేత్ర పరీక్ష చేయించుకున్నాను. వీరు నిరక్షరపరచిన అద్దములు స్వీకరించితిని. వీరి ప్రావీణ్యమును పరీక్షించుటకై. వీరి అధునాతన మోడాం జనతాలప్రిషియన్, నిజాం షాహీ రోడ్, హైద్రాబాద్ చూచుట తటస్థించినది. వీరి నేత్ర పరీక్ష సైంటిఫిక్ పద్ధతిగానుండుట ముదావహము. నేత్ర పరీక్షా నంతరము వారిచ్చిన అద్దములు నాకు చాల అనుకూలముగా నున్నవి. ఎవరికైనను నేత్ర సంబంధ చికిత్స చేయించుకొనవలెననియున్న తప్పక డాక్టర్ లుఖ్మాన్ గారి సేవ పొందగలరని గర్వంతో సిఫారసు చేయుచున్నాను. వీరికి ఇతోధిక ప్రఖ్యాతి, విజయము లభించుగాక యని కోరుచున్నాను.

సం॥ తేది 9-6-61.

మీరును నేత్ర పరీక్షకు కంటి అద్దములు పొందుటకు ప్రఖ్యాత నేత్ర పరీక్షకుని సేవను పొందండి.

క్లుప సం॥ ఆషాఢ బహు నవమి
తె. 5-10 వరకు ఉ. 9-54
కా.శ. 10-32 మొ: 12-2 వరకు
(శాలివాహన శకము: 1883)
4-8-1961 శుక్రవారము

"వైష్ణవియుఁగల్మష ప్రజ ధ్వంసిని యునునైన యీయనుస్మృతి ప్రాజ్ఞుఁడైన నజ్ఞుఁడైన నెవ్వాఁడు పఠియించు యజ్ఞదాన సమయములవాఁడు తత్ఫల శతమువడయు."

— భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 35280

4 ఆగస్టు 1961
శుక్రవారము

దేశములో వరదల నష్టాలు

కేరళ, మద్రాసు, మైసూరు ప్రాంతాలలో చెలరేగిన నదుల వరదలు అంతటితో ఆగక దేశమంతటను విజృంభించినవి. వార్షిక సంఘటనలుగా నున్న యీ వరదలు ప్రతి సంవత్సరము అపారమైన ఆస్తి నష్టమును, ప్రాణ నష్టమును కలిగించుచున్నవి. కొన్ని వారాల క్రింద ప్రారంభమైన యీ నదుల వరదలు యిప్పటివరకు ఆగలేదు. ముందున్నది ముసుళ్ళ పండుగ యన్నట్లుగా యింకను శ్రావణ భాద్రపద మాసాలు గడచి పోలేదు. ప్రతి సంవత్సరానికన్న ముందుగానే యీ సంవత్సరము నదీజలాల బెడద ప్రారంభమైనది. గత సంవత్సరాల అనుభవమును గుర్తించినప్పుడు సెప్టెంబరు నెల మిక్కిలి ఉపద్రవకరమైనదని వెల్లడి యగుచున్నది.

ఉత్తర దేశములో నదుల విజృంభణ ప్రారంభమైనది. అస్సాం, బీహారుల నుండి వచ్చు వార్తలు ఆందోళనను కలిగించుచున్నవి. ఢిల్లీలో కురిసిన కుంభవృష్టి ఫలితముగా పట్టణమంతయును జలమయమైనట్లు నిన్నటివార్తలు తెలుపుచున్నవి. ముగ్గురు పసిపిల్లలతోపాటు నలుగురు పెద్దవారు వరదలలో కొట్టుకొనిపోయి మరణించినట్లును, రాకపోకలు స్తంభించిపోయినట్లును, ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను మూసివేయవలసిన పరిస్థితి యేర్పడినట్లును, రైలుస్టేషన్‌లు, విమానాశ్రయాలు జలమయమైనందున రైళ్ళు, విమానాలు భారత రాజధానీ నగరము చేరుకొనలేదనియు వార్తలు తెలుపుచున్నవి. ఈ ప్రమాదము యెన్ని రోజులు ఉండగలదో తెలియదు.

ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణపొంగి పొరలి నందున విజయవాడలో జరిగిన నష్టము, కల్లోలము పత్రికా పాఠకులందరికిని తెలిసియే యున్నది. రెండు వారాలలో రెండు పర్యాయములు వరదలు చెలరేగి విజయవాడ పౌరులకు కలిగించిన యిబ్బందులు దుస్సహముగా నున్నవని వార్తలు తెలుపుచున్నవి. ప్రతి సంవత్సరము కృష్ణ విజృంభించుచున్నది. ఈ విజృంభణను అరికట్టుటకు యేవేవో పథకాలు అమలు చేయబడుచున్నవి. కాని యిందువలన యెక్కువగా ప్రయోజనము కలుగుటలేదు. ఎక్కడ నుంటివే గొంగళీ యనగా వేసినచోటు నసే యన్నట్లుగా వరద నిరోధక పథకాల అమలువలన ప్రయోజనము కలుగక, పరిస్థితి యథాప్రకారముగానే యున్నది. శాశ్వతముగా విజయవాడకు వరద ప్రమాదమును నివారించవలెననినచో ఒక పక్కా కరకట్ట నిర్మించవలసి యుండుననియు, యిందుకొరకు యెనిమిది లక్షల రూపాయలు కావలసి యుండుననియు చెప్పబడుచున్నది. సంపన్నులైన విజయవాడ ప్రజలు మరియు విజయవాడ మునిసిపాలిటీ యీ విషయమై ఆలోచించి, ప్రభుత్వ సహాయముతో యిందుకు కావలసిన యేర్పాటులు చేయగలరని ఆశించుచున్నాము. ప్రభుత్వము యీ విషయమై తగు సహాయము చేయగలదని విశ్వసించుచున్నాము.

తెలంగాణా ప్రాంతము నుండి కూడ వరదల విజృంభణ వార్తలు చేరుచున్నవి. మహబూబ్‌నగరం జిల్లాలో కృష్ణా నది, దాని ఉపనదులు ఉప్పొంగి కలిగించిన నష్టము వివరాలు ప్రతికలలో ప్రకటితమైనవి. నిన్నటి వార్తల ప్రకారము గద్వాల్లో కుండపోతగా వానలు కురిసినందున మూడు నూర్ల పైచిలుకు యిండ్లు కూలిపోయి, మిక్కుటమైన నష్టము కలిగినట్లు తెలియుచున్నది. ఈ వర్షాలు వెంటనే ఆగక పోయినచో, ఎన్నియో బీదకుటుంబాలు నిరాశ్రయము కాగలవనియు, పచ్చి కరువు రాగల ప్రమాదము గోచరించుచున్నదనియు తెలియుచున్నది. సరిగా యీ సమయానికే ఖమ్మం జిల్లాలోని ఇల్లెందునుండి మరికొన్ని వార్తలు వచ్చినవి. ఈ వార్తల ప్రకారము యిల్లెందులో నిరంతర వర్షాల ఫలితముగా సుమారు వేయి యిండ్లు నీటిలో మునిగి పోయినవనియు అనేకులు కట్టబట్టలు, తిండిగింజలు, నిలువ నీడలేక అల్లాడుచున్నారనియు తెలియుచున్నది. ఈ విధముగా వరదల వలన, అతివృష్టివలన, యీ సంవత్సరము కరువు రాగల ప్రమాదము గూడ గోచరించుచున్నది.

దేశవ్యాప్తముగా ప్రతి సంవత్సరము చెలరేగు వరదలను శాశ్వతముగా అరికట్టి, నిరోధించు పథకాలను అమలు జేయు విషయమై తగు చర్యలను తీసికొనవలసియుండును. లేకపోయినచో మన అభివృద్ధి ప్రణాళికలవలన సత్ ఫలితాలు గూడ యేమియును గలుగజాలవు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వము సంప్రదించుకొని, వరదల శాశ్వత నిరోధముకొరకు కావలసిన యేర్పాటులను చేయవలసి యుండును. వరద బాధితులకు సకాలములో సరియైన సహాయము గావించు విషయమై ప్రత్యేకశ్రద్ధను తీసికొనవలసి యుండును.

సిటిజెన్సు ప్రొటెస్టు కమిటీ సమావేశము

హైదరాబాద్, ఆగస్టు 3

బేగంపేటలో నవివాలయాల నిర్మాణం విషయంలో ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంపట్ల ఆక్షేపణను తెలుపుటకై యేర్పాటు చేయబడ్డ సిటిజన్స్ ప్రొటెస్టు కమిటీ సభ్యులు మొన్న శ్రీ మనోహర్ సింగ్ అధ్యక్షతన సమావేశమై సెక్రటేరియట్ భవన నిర్మాణవిషయంలో శాసనసభలో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగపాఠాన్ని మంత్రి వర్గనిర్ణయాన్ని పరిశీలించారు. ఈసందర్భంలో తెలంగాణా ప్రాంతీయ సంఘం తోను, రాష్ట్ర గవర్నర్‌ను కలుసుకొనుటకు సభ్యులు నిశ్చయించారు.

నగరాలు, గ్రామాల జనాభాల నిష్పత్తి

గత 10 ఏండ్లలోనూ యించుమించు సమానం

న్యూఢిల్లీ, ఆగస్టు 3

నగరాల జనాభా, గ్రామాల జనాభాల నిష్పత్తి పదేళ్ల క్రిందట ఎంత వున్నదో యిప్పుడూ యించుమించుగా అంతే వున్నది.

1951లో నగరాల జనాభా మొత్తము జనాభాలో నూటికి 17.88 వంతులు. మొత్తము జనాభా 359,216,905. 1961లో ఆ శాతము 17 84. మొత్తం జనాభా 436,424,429 కాగా నగరాలజనాభా 77,889,900. గ్రామప్రాంతాల అప్పటి జనాభా నూటికి 82.12 వంతులు. (294,085,667). గ్రామాల యిప్పటి జనాభా 82.16 శాతం (358,534,529).

గత పదేళ్ళలోనూ నగర జనాభా అత్యధిక పెరుగుదల అస్సాం రాష్ట్రములో. అది నూటికి 116.69 వంతులున్నది. ద్వితీయస్థానము ఒరిస్సా రాష్ట్రానిది (87.02 శాతము, తృతీయ స్థానము బీహారు (49.08), మధ్యప్రదేశ్ (47.76 శాతం), కేరళ (42.44 శాతం).

ఇతర రాష్ట్రాలలో జనాభా పెరుగుదల యీ క్రింది విధముగా వున్నది: పంజాబ్-39.02 శాతం, పశ్చిమ బెంగాల్ - 28.88, మద్రాసు - 22.91, మహారాష్ట్ర-19.59, గుజరాత్-19.25, మైసూరు-16.41, ఆంధ్రప్రదేశ్-15.13, రాజస్థాన్-9.40, ఉత్తరప్రదేశ్-9.86.

జమ్మూ-కాశ్మీరు రాష్ట్రములోని జనాభాలో నూటికి 65 34 మంది ఒక లక్ష అంతకుమించిన జనాభాగల నగరాలలో నివసిస్తున్నారు. మహారాష్ట్ర-62.28 శాతం, పశ్చిమ బెంగాలులో-58.18 శాతం, ఉత్తరప్రదేశ్ - 55.24, ఆంధ్రప్రదేశ్-49.82, గుజరాత్-42.66, మధ్యప్రదేశ్-39.13, రాజస్థాన్-38.35, మద్రాసు - 37.70, బీహారు-32.45, మైసూరు - 33.67, పంజాబ్-26 28, ఒరిస్సా - 13.19, అస్సాం-11.88.

జాతీయ విద్యాసంస్థల డిగ్రీలు

మరో సంవత్సరంపాటు పరిగణన

న్యూఢిల్లీ, ఆగస్టు 3

కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగాలిచ్చేందుకుగాను, కొన్ని జాతీయ విద్యాసంస్థలు బహూకరించేడిగ్రీలూ, డిప్లొమాలకుపరిగణనను మరోసంవత్సరంపాటు అంటే 1962 సెప్టెంబరు 17 వరకూ, యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషనుతో సంప్రదించి భారత ప్రభుత్వము పొడిగించింది.

ఆ డిగ్రీలివి: కాంగ్రీలోని గురుకుల విశ్వవిద్యాలయం బహూకరించే అలంకార్, ఢిల్లీలోని జమియా మిల్లియా ఇస్లామియా బహూకరించే జమియాన నదీ, కాశీ విద్యాపీఠం బహూకరించే శాస్త్రి వీటిని "బి. ఎ." పట్టానికి సమంగా పరిగణిస్తారు. జమియా మిల్లియా ఇస్లామియా బహూకరించే సనద్-ఎ-మౌలిమిని బి ఇడి. లేదా బి.టి డిగ్రీకి సమంగా పరిగణిస్తారు. గురుకుల కాంగ్రీ బహూకరించే విద్యాధికారి, గురుకుల్ బృందావన్ బహూకరించే అధికారి పరీక్షలను మెట్రిక్‌కు సమంగా పరిగణిస్తారు.

గ్రామీణ ఉన్నత విద్యా జాతీయ సంస్థ బహూకరించే గ్రామీణ సర్వీసుల డిప్లొమాకు గుర్తింపబడిన విశ్వవిద్యాలయమిచ్చే తొలి డిగ్రీతో సమమైనదిగా శాశ్వతమైన పరిగణన ఇచ్చారు.

సముద్ర మార్గాన బొగ్గు రవాణా

న్యూఢిల్లీ, ఆగస్టు 3

సముద్ర మార్గాన బొగ్గు రవాణాకు సబ్సిడీ యిచ్చే పథకాన్ని ప్రవేశపెట్టడానికి భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం క్రింద వాడకం దార్లకు రైలుమార్గాన రవాణా అయితే ఎంత ఖరీదుకు వస్తుందో ఇప్పుడూ అంత ఖరీదుకే లభిస్తుంది.

కలకత్తా రేవునుంచి 1961 మే 1వ తేదీన లేక ఆ తర్వాతరవాణాఅయిన బొగ్గుకు యీ పథకం వర్తిస్తుంది. రైలు-సముద్ర మార్గాన రవాణా అయినదానికీ, పూర్తిగా రైలుమార్గం ద్వారా రవాణా అయిన దానికీ ఆయ్యే రేవుల తేడా మొత్తం సబ్సిడీగా యిస్తారు. వివరాలకు కలకత్తాలని బొగ్గు వ్యవహారాల కంట్రోలరుకార్యాలయం నుంచి పొందవచ్చును.

తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎన్నికలు

హైదరాబాదు, ఆగస్టు 3

తాండూరు వ్యవసాయమార్కెట్ కమిటీకి వర్తకుల ప్రతినిధులుగా శ్రీ యుతులు వైవీరన్న, కె. వీరయ్య యు నరసింహులు, మోతీలాల్ ఎన్నికైనారు.

శాసన సభ్యులపట్ల అధికార్ల అసభ్య ప్రవర్తన

సంజాయిషీ కోరుతానని ఆర్థిక మంత్రి హామీ

హైదరాబాద్, ఆగస్టు 3

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లాకమీషన్ ప్రారంభోత్సవ సందర్భంలో కొందరు సభ్యులపట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధికార్లకు వ్యతిరేకంగా తగుచర్య తీసుకోబడుతుందని ఆర్థిక శాఖమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నిన్న శాసనసభలో హామీయిచ్చారు.

సమావేశంలో పాల్గొనుటకువెళ్ళిన సభ్యులను గౌరవనీయ సభ్యులకై యుద్దేశించబడిన ద్వారం ద్వారా ప్రవేశించ నీయలేదని, తమకు ప్రభుత్వాధికార్ల వెనుక స్థానాలు ఏర్పాటు చేయబడినాయని సభలో ప్రతిపక్ష ఉపనాయకుడు శ్రీ జి. యల్లమంద రెడ్డిచేసిన ఆరోపణను ప్రస్తావించి ఆయన పైవిధంగా అన్నారు.

సభ్యులపట్ల అధికారులు చూపిన నిరాదరణకు ఆర్థిక మంత్రి విచారం వెలిబుచ్చుతూ అధికార్లనుండి సంజాయిషీ కోరనున్నట్లు చెప్పారు.

స్వాతంత్ర్యం లభించి 14 సంవత్సరాలైనా అధికారులధోరణిమారనందుకు ప్రతిపక్ష నాయకుడు తనతీవ్రనిరసనను తెలియజేస్తూ యీ విషయమై కఠినచర్య తీసుకోవాలని మంత్రిని కోరాడు.

అధికార్లు సభ్యులను ప్రత్యేక ద్వారం గుండా ప్రవేశించకుండా ఆటంకపరచినవుడు వారేమి అనలేదట. లేకున్న రభసజరిగేది; అందుకు సభాధ్యక్షులు సభ్యుల నభినందించారు. శాసనసభ సర్వాధికారాలను కలిగియుంది. దానినుండి మంత్రులు వీరినుండి ప్రభుత్వాధికారులు అధికారాలను పొందారని శ్రీ కాశేశ్వరరావు అన్నారు.

సంజామల పంచాయత్ సమితి

కర్నూలు, ఆగస్టు 3

జిల్లా కలెక్టరు శ్రీ జి. నారాయణ శెట్టి గతనెల 30న కోయిలకుంట్ల తాలూకా సంజామల పంచాయతీ సమితిలో జరుగుచున్న అభివృద్ధి పథకాల గ్రామాలను పరిశీలించుటకు వెళ్ళారు. అగ్రామాలలో జరుగుచున్న అభివృద్ధిని చూచి కొనియాడారు. తర్వాత ఆరోగ్య విద్యా, వ్యవసాయ, రహదారులు, హరిజనులకు జరుగుతున్న సహాయము సక్రమంగా జరుగుతున్నదానని కూడా పరిశీలించారు. తర్వాత ఉప్పలపాడు, కుంకుట్ల గ్రామాలకు కూడా వెళ్ళారు.

పంచాయత్ సమితి ప్రాథమిక పాఠశాల

కర్నూలుజిల్లా డోన్ తాలూకాలోని కొచ్చెర్వు గ్రామంలో జిల్లా కలెక్టరు శ్రీ జి. నారాయణ శెట్టి పంచాయతీ సమితి ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. స్థానికసమితి అధ్యక్షులు శ్రీ కె. వెంకట శెట్టి అధ్యక్షత వహించారు. పంచాయతీబోర్డు అధ్యక్షులు శ్రీ బి. పెద్దమద్దిలేటి రెడ్డి స్వాగతం తెల్పారు.

తర్వాత జిల్లా కలెక్టరు జిల్లాలో బడిలేనిగ్రామమే వుండకూడదని, ప్రతివారు విద్యను నేర్చుకోవాలని తెల్పారు.

ఆంధ్రప్రదేశ్‌లోనిపశు, జంతుసంపద

న్యూఢిల్లీ, ఆగస్టు 3

ఆంధ్రప్రదేశ్‌లో పశు జంతుసంపద గత 5 ఏళ్ళలోనూ, నూటికి 10.6 వంతులు, పెరిగినదనీ. హిమాచల ప్రదేశ్‌లోనూ నూటికి 1.4 వంతులుతగ్గినదనీ 1961 ఏప్రిల్ 15 వ తేదీన తయారు చేసిన లెక్కలను బట్టి తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లోపశుసంపద మొత్తం సంఖ్య 826 44 లక్షలని అంచనా. 1956 లోని లెక్కల ప్రకారం అది 295 13 లక్షలు. పశువుల సంఖ్య 112.77 లక్షల నుంచి 122.81 లక్షలకు పెరిగింది. అందులో మూడేళ్ళ వయస్సును మించినవి నూటికి 8.6 వంతులు పెరిగాయి. గేదెల సంఖ్య 59 68 లక్షల నుంచి 69 65 లక్షలకు పెరిగింది.

గొర్రెల సంఖ్య 78.43 లక్షలనుంచి 88.71 లక్షలకు పెరిగింది. మేకలసంఖ్య 36.99 లక్షల నుంచి 42.67 లక్షలకు పెరిగింది గుర్రాలసంఖ్య 0.82 లక్షల నుంచి 0.74 లక్షలకు పెరిగింది. కోళ్ళ సంఖ్య 147.37 లక్షల నుంచి 161.26 లక్షలకు పెరిగింది. ట్రాక్టర్ల సంఖ్య 1,628 నుంచి 2,460 కు పెరిగింది.

అంతర్జాతీయ సువ్యవస్థా నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర

ప్రపంచ అధ్యాపక వృత్తిసంస్థల కాన్ఫెడరేషనులో డా॥ శ్రీమాలి ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 3

ప్రస్తుత ప్రపంచ పరిస్థితి దృష్ట్యా అధ్యాపకులపై గురుతరమైన బాధ్యత పడుతోందనీ, ఏ జాతి తన శాంతి ప్రవచనాలను తానే ఉల్లంఘించడానికి వీలులేనటువంటి ఒక ప్రపంచ వ్యవస్థను రూపొందించడానికి అధ్యాపకులు తమ్ముతాము హృదయపూర్వకంగా అంకితము చేసుకోవాలనీ, కేంద్ర విద్యామంత్రి డా॥ కె.ఎల్. శ్రీమాలి ఇక్కడ విజ్ఞాన్‌భవన్‌లో ప్రపంచఅధ్యాపక వృత్తిసంస్థల కాన్ఫెడరేషను 10వ వార్షిక అసెంబ్లీ రెండవ సర్వసభ్య సమావేశములో ప్రసంగిస్తూ ఉద్బోధించారు.

ఈ విషమ సమయములో సంకుచిత జాతీయతను హేతుబద్ధమైన బాధ్యతాయుతమైన అంతర్జాతీయ వ్యవస్థకు మధ్య ఏర్పడే ఘర్షణలను ప్రజాదృష్టికి పస్ఫుటముగా, ప్రదర్శించడము అధ్యాపకుల ముఖ్య బాధ్యత అని డా॥ శ్రీమాలి పేర్కొన్నారు.

డా॥ శ్రీమాలి తమ ప్రసంగంలో ఇంకా ఇలా చెప్పారు:-

కోటాను కోట్ల బాల బాలికలకు యువతీ యువకులకు విద్యాబోధకార్యాలు సమకూర్చడమనే భగీరథ కృషిలో మేము ఇప్పుడు నిమగ్నమై ఉన్నాము. తమ ప్రజలకు తిండి బట్ట, ఆశ్రయము, విద్య మొదలయిన ప్రాథమిక జీవితావసరాలను ఒనకూర్చడానికి వెనుకబడిన దేశాలు చేస్తున్న కృషిలో తోడ్పడడము సంపన్న పురోగామి దేశాల విధి.

వెనుకబడిన ప్రాంతాలకు సహాయం

వెనుకబడిన దేశాలకు రుణదారిద్ర్యాల నుండి విముక్తి కల్పించాలన్న ఆకాంక్ష అభివృద్ధి చెందిన దేశాలలో కానవస్తున్న మాట నిజము. అయితే అధికముగా పరసహాయము మీద ఆధారపడి పరాధీనులమైతే, స్వయము కృషికి వ్యాఘాతము కల్గుతుందేమోన్న భయంకొద్దీ, కొత్తగా స్వాతంత్ర్యము పొందిన దేశాలు విదేశ సహాయాన్ని స్వీకరించడానికి కొంత వెనుకాడుతున్నాయి. అందువల్ల ఈ పరిస్థితిలో విదేశ సహాయాన్ని అంతర్జాతీయ సంస్థల ద్వారా అందజేయడము ఉత్తమమని సూచన చేయడము జరిగింది. అయితే అన్ని సంపన్న దేశాలూ తమ వనరులను సమీకరించి తమ శక్త్యనుసారము ఈ భారాన్ని వంచుకున్నప్పుడే ఇది సాధ్యము అవుతుంది.

వివిధ జాతుల మధ్య ఆర్థిక సమానత్వము లేకపోవడము ప్రపంచములోని నేటిసంఘర్షణలకు ఉద్విగ్నతకుప్రధాన కారణము. రాజకీయ అస్థిరత్వాన్ని తొలగించాలంటే, ముందు ఈ ఆర్థిక అసమానత్వాన్ని రూపు మాపడము అత్యవసరము. ఈ నాడు అధునిక విజ్ఞానము ద్వారా ప్రపంచములోని క్షుధా వ్యాధి దారిద్ర్య అజ్ఞానాలను నిర్మూలించడానికి అవకాశము ఏర్పడింది. అంతర్జాతీయ సహకార సామరస్యాల ద్వారా సమాజంలోని కీడును దోసగులను తొలగించడానికి సరిగా అవకాశము ఏర్పడిన ఈ తరుణములో మానవుడు ఆత్మహననానికి సమాయత్తము కావడము నిజముగా విషాదకరము.

అధ్యాపకుల బాధ్యత

హింసావాదము స్థానే హేతువాదము నెలకొని, మానవ సంబంధాలు నయమార్గాన నిర్వహించబడే ప్రపంచ వ్యవస్థను నిర్మించగలిగినప్పుడే ప్రపంచములోని నేటి విషమావస్థ తొలగిపోతుంది. ఈ పని అత్యావశ్యకమే కాదు. ఇది మహదవకాశము. ఏ మార్గాన్ని మనము అనుసరించాలో నిర్ణయించుకోవలసిన విషమ సమయము ఇది. పౌరులలో విధిబాధ్యతా పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉద్దేశింపబడిన ఏ విద్యా కార్యక్రమము అయినా, నాగరకతమ ఈనాడు ఎదుర్కొంటున్న మహత్తర విపత్తులను వారి దృష్టికి తెచ్చేదిగా ఉండాలి. ప్రపంచము అంతటా అత్యధిక సంఖ్యాకులు శాంతి కోసము పరితపిస్తున్నారు. అంతర్జాతీయముగా వచ్చే అభిప్రాయ భేదాలను పరిష్కరించడానికి యుద్ధమే మార్గమని విశ్వసించే వివరీత వాదులను ప్రజలు ధైర్యంగా ఎదుర్కొని నిలబడ గలిగేటట్టు వారిలో సంకల్ప బలాన్ని, దీక్షను సృష్టించడము విద్యా కార్యక్రమము యొక్క ముఖ్య కర్తవ్యము. శాంతికి ప్రత్యామ్నాయము సంపూర్ణ వినాశమే. 21 వ శతాబ్దములో ఎదురయ్యే కొత్త బాధ్యతలను వహించడానికి యువతరాన్ని సమాయత్తము చేయడము విద్యా కార్యక్రమము ప్రధాన కర్తవ్యముగా ఉండాలి.

సమాజం

ప్రస్తుతపు ప్రపంచ పోకడలను పరిశీలిస్తే, వైయక్తిక, వ్యక్తి స్వాతంత్ర్యయుగము అంతరించిందనీ, సమాజానికి ప్రాధాన్యము ఇచ్చే ఒక నూతన యుగము ఉదయిస్తోందనీ బోధపడుతుంది. ఆధునిక సమాజములోని పౌరుడు సమాజ స్వాతంత్ర్యాన్ని పెంపొందించే నిమిత్తము తన వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని పరిమితము చేసుకోవడము నేర్చుకోవాలి. ఈ నాడు వ్యక్తి స్వాతంత్ర్యమా? సమష్టి శ్రేయస్సా? ఏది కావాలి అన్నది ప్రశ్న కానేకాదు. నియంతృత్వము క్రింద సమష్టి శ్రేయస్సును సాధించడానికి పూనుకోవాలా? లేక ప్రజాస్వామిక ప్లానింగు ద్వారా ఈ లక్ష్యాన్ని అందుకోవాలా? అన్నదే ప్రశ్న. వ్యక్తి సమాజముతో తాదాత్మ్యం పొంది తన సంకుచిత స్వలాభాన్ని సమాజ శ్రేయస్సు కోసము త్యాగము చేసినప్పుడే అతను నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవించ గలుగుతాడు. వ్యక్తి స్వార్థాన్ని పరిమితపరచే ప్లానింగు ప్రజాస్వామిక జీవన విధానానికి వ్యతిరిక్తము కాదు. ప్రత్యుత, అవి దానికి పునాది.

